హైదరాబాద్
11-9-2023
సంపుటి:08
సంచిక: 354
పేజీలు: 4
వెల: రూ.5/-
CEO & Editor : G. PRUDHVIRAJ
RNI NO: TELTEL/2016/73311
www.samasamajam.in

# సమ సమాజం

SAMA SAMAJAM TELUGU DAILY
తెలుగు దిన పత్రిక

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole



# బాబుకు రిమాండ్

## రాజమహేంద్రవరం జైలుకు తరలింపు

### స్కిల్ డెవల్‌పమెంట్ కేసులో అరెస్టు

- జైలుకు పంపాలంటూ సీఐడీ..
- రిమాండ్ తిరస్కరించాలని చంద్రబాబు
- ఏసీబీ కోర్టులో 6 గంటలపాటు వాదనలు
- చివరికి 14 రోజుల రిమాండ్ విధిస్తూ తీర్పు
- జైలులో ప్రత్యేక వసతులకు జడ్జి అనుమతి
- కస్టడీ కోసం సీఐడీ పిటిషన్.. నేడు విచారణ
- కోర్టుకు హాజరుపరచడంలోనూ హైడ్రామా
- సరిగ్గా '24 గంటల' గడువు ముగిసే టైంలో
- మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచిన సీఐడీ



**పోరాటమే మన పథం**

"బాధపడవద్దు. భయపడవద్దు. ఇవన్నీ తాత్కాలికమే. దుష్ట శక్తులతో పోరాడే సమయంలో ఇలాంటి ఒడిదొడుకులు వస్తూనే ఉంటాయి. మరింత పట్టుదలతో, మరింత శక్తితో పోరాడదాం. ఈ పోరాటానికి నేను మానసికంగా సిద్ధపడే ఉన్నాను. మీరు కూడా అలాగే ఉండండి!"

- కుటుంబ సభ్యులతో చంద్రబాబు

హెూరాహెూరీ వాదనలు... తీవ్ర ఉత్కంఠ! రిమాండ్‌కు పంపిస్తారా? లేక... తిరస్కరిస్తారా? అనే హైటెన్షన్! చివరికి... తీర్పు వెలువడింది. స్కిల్ డెవల్‌పమెంట్ కేసులో అరెస్టయిన టీడీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపిస్తూ విజయవాడలోని ఏసీబీ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఆదివారం ఉదయం 6 గంటలకు మొదలైన ఈ హైటెన్షన్ రాత్రి 7 గంటల వరకు కొనసాగింది. చంద్రబాబును సీఐడీ అధికారులు శనివారం ఉదయం 6.15 గంటలకు నంద్యాలలో అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత 24 గంటల్లో ఆయనను మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచాల్సి ఉంది. గరిష్ఠ సమయం తమ అదుపులోనే ఉంచుకుని... ఆదివారం తెల్లవారుజామునే మేజిస్ట్రేట్ ముందుకు తీసుకెళ్లే అవకాశముందని 'ఆంధ్రజ్యోతి' ముందుగా చెప్పినట్లుగానే జరిగింది. తెల్లవారుజామున 3 గంటలకు సిట్ కార్యాలయం నుంచి ఆయనను ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారు. అక్కడ

- మిగతా 2వ పేజీలో

# శిథిలాలు.. మృతదేహాలు!

## మొరాకోలో ఎక్కడ చూసినా భీతావహ దృశ్యాలు

- 2,012 మంది చనిపోయినట్లు అధికారుల వెల్లడి
- మరణాల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం
- భారతీయులెవరికీ ఏం కాలేదు: భారత ఎంబసీ



ఎక్కడ చూసినా నేలమట్టమైన ఇళ్లు, భవనాలు. ఆ శిథిలాలను తొలగిస్తూ పోయిన కొద్దీ బయటపడుతున్న వందల మృతదేహాలు. గాయపడిన వారి ఆర్తనాదాలు, ప్రజల హాహాకారాలు, శవాల దిబ్బలు, ఆకలి కేకలు.. అంతా భీతావహం. మొరాకోలో పెను భూకంపం సృష్టించిన విలయంలో మృతుల సంఖ్య శనివారంతో పోలిస్తే రెట్టింపై 2,012కు పెరిగింది. మరణాల సంఖ్య ఇంకా భారీగా పెరిగే అవకాశం ఉంది. అట్లాస్ పర్వతాల్లో భూకంప కేంద్రానికి సమీపంగా ఉన్న గ్రామాల్లో శిథిలాల తొలగింపు మందకొడిగా సాగుతోంది. ఇక్కడ మరణాలు ఎక్కువ సంఖ్యలో ఉండొచ్చని భావిస్తున్నారు. భూకంపం కారణంగా చనిపోయిన వారి సంఖ్య 2,012కు పెరిగిందని మొరాకో అధికారులు ఆదివారం ప్రకటించారు. ఒక్క అల్ హౌస్ ప్రావిన్సులోనే 1,293 మంది మరణించినట్లు వెల్లడించారు. 2,059 మంది గాయపడ్డారని, వీరిలో 1,404 మంది పరిస్థితి విషమంగా ఉందని పేర్కొన్నారు. భూకంప మృతుల్లో విదేశీయులు కూడా ఉన్నట్లు అనుమానిస్తున్నారు. అయితే, భారతీయులు ఎవరూ గాయపడినట్లు గానీ, చనిపోయినట్లు గానీ సమాచారంలేదని అక్కడి భారత రాయబార కార్యాలయం తెలిపింది.

**రోడ్లపైనే నిద్ర...**

మొరాకోలో 3 రోజులు సంతాప దినాలను పాటించాలని రాజు మహమ్మద్-6 ప్రకటించారు. బాధితులకు ఆహారం, పునరావాసం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కాగా భూకంపం సంభవించి రెండు రోజులు గడిచినా ప్రజల్లో భయంపోవడం లేదు. మళ్లీ భూకంపం వస్తుందేమోనని ఆదివారం రాత్రి కూడా చాలా మంది ఇళ్ల బయటే పడుకున్నా రు. వారంతా సాధ్యమైనన్ని నిత్యావసర సరుకులను వెంట తెచ్చుకొని రోడ్లపైనే గడుపుతున్నారు. భారత కాలమానం ప్రకారం శనివారం

- మిగతా 2వ పేజీలో





# మీరు ఆ నియోజకవర్గాలకే సీఎం, మంత్రులా?

## కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌లకు రేవంత్ ప్రశ్న

కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులకు గజ్వేల్, సిరిసిల్ల, సిద్దిపేట నియోజకవర్గాలే ముఖ్యమా అని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఆ మూడు నియోజకవర్గాలకు మాత్రమే వారు సీఎం, మంత్రులుగా పని చేస్తున్నారని మండిపడ్డారు. ఆ నియోజకవర్గాలకే నిధులు కేటాయించి అభివృద్ధి చేసుకుంటున్నారని ఆరోపించారు. కొడంగల్ నియోజకవర్గం రాష్ట్రంలో భాగం కాదా అని ప్రశ్నించారు. కొడంగల్ నియోజకవర్గానికి చెందిన పలువురు బీజేపీ, బీఆర్ఎస్ నేతలు ఆదివారం రేవంత్ నివాసంలో ఆయన సమక్షంలో కాంగ్రెసలో చేరారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ కొడంగల్‌ను అభివృద్ధి చేస్తామన్న బీఆర్ఎస్ నేతలు ఐదేళ్లలో నియోజకవర్గానికి ఏం చేశారని నిలదీశారు. కొడంగల్‌ను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తానని చెప్పిన కేటీఆర్.. నియోజకవర్గ ప్రజలను మోసం చేశారని ధ్వజమెత్తారు. నారాయణపేట్ - కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని పడావు పెట్టారని, బొంరాసపేట, దౌల్తాబాద్‌లలో జూనియర్ కాలేజీలు ఏర్పాటు చేయలేదని, వికారాబాద్-తాండూర్ రైల్వే లైన్‌కు ఇప్పటికీ మోక్షం లభించలేదని పేర్కొన్నారు. ఓట్లకోసం వచ్చే బీఆర్ఎస్ నేతలను కొడంగల్‌కు ఏం చేశారో చెప్పాలని నిలదీయాలని ఆయన అన్నారు. కాగా, రాష్ట్రవ్యాప్తంగా

- మిగతా 2వ పేజీలో

# హైదరాబాద్‌లో భారీ వర్షం!

## లంగర్‌హౌజ్, ముషీరాబాద్‌లో 4.3 సెం.మీ. వర్షపాతం

## రాష్ట్రంలో రెండ్రోజులు వర్షాలు

# 17న జాతీయ సమైక్యతా దినోత్సవం

- రాష్ట్రవ్యాప్తంగా వేడుకలు ఘనంగా నిర్వహించాలి
- బీఆర్ఎస్ శ్రేణులూ పెద్ద సంఖ్యలో పాల్గొనాలి
- బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు
- జిల్లాల్లో ప్రభుత్వ ఆధ్వర్యంలో జెండాల ఆవిష్కరణ
- హైదరాబాద్‌లో వేడుకలకు సీఎం కేసీఆర్ హాజరు

హైదరాబాద్: ఈ నెల 17న రాష్ట్రవ్యాప్తంగా జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కే తారకరామారావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులు, ప్రజలు జాతీయ సమైక్యతా దినోత్సవ వేడుకల్లో పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆదివారం ఓ ప్రకటనలో కోరారు.

# జగన్ ఓ సైకోపాత్!

- ఆయన జైలుకెళ్లాడని అందరూ వెళ్లాలనుకుంటాడు
- ప్రత్యర్థులను నేరగాళ్లుగా చిత్రీకరిస్తున్నాడు
- చట్టాలు పనిచేస్తే సీఎం అయ్యేవాడు కాదు
- ఏపీలో దోచుకుని లండన్‌లో దాచుకుంటున్నాడు
- చంద్రబాబు కోసం స్పందించడం సంస్కారం: పవన్



'నేను జైలుకు వెళ్లాను కాబట్టి అందరూ జైలుకు వెళ్లాలనేలా జగన్ తీరు ఉంది. ఓ సైకో పాత్ ఆలోచనలు ఇలానే ఉంటాయి. ఆయన క్రిమినల్ ఆలోచనలు కలిగిన వ్యక్తి' అని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ధ్వజమెత్తారు. అక్రమంగా సంపాదించిన డబ్బుతో రాజ్యాధికారం సాధించి.. ప్రత్యర్థులందరినీ నేరగాళ్లుగా చిత్రీకరించేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఆదివారమిక్కడ మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో పీఏసీ సభ్యులు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులపై సమావేశంలో చర్చించారు. 'రాష్ట్ర దౌర్భాగ్యం ఏమిటంటే ఆర్థిక నేరాల్లో 16 నెలలు జైలులో ఉండి.. బెయిల్ మీద బయట తిరుగుతున్న వ్యక్తి మన ముఖ్యమంత్రి. చట్టాలు సంపూర్ణంగా పని చేసి ఉంటే జగన్ అనే వ్యక్తి జన్మలో ముఖ్యమంత్రి అయ్యేవాడు కాదు. వివేకా హత్య కేసులో వేళ్లన్నీ ఆ కుటుంబం వైపే చూపిస్తున్నా.. మర్డర్ చేసినోళ్లు బయటే తిరుగుతున్నారు. చట్టాలు బలంగా పనిచేసి ఉంటే వాళ్లందరూ జైల్లో ఉండేవారు. నిజంగా రాష్ట్రానికి ఇవి చీకటి రోజులు, ప్రజలందరూ మేల్కోవలసిన సమయం ఆసన్నమైంది. వైసీపీయే శాంతిభద్రతల సమస్యలు సృష్టిస్తోంది. పార్టీ కార్యాలయంలో ముందుగానే నిర్ణయించుకున్న కార్యక్రమానికి హాజరవడానికి బయలుదేరితే హైదరాబాద్‌లో విమానం టేకాఫ్ కాకుండా చేశారు. రోడ్డు మార్గంలో వస్తే ఆంధ్ర బోర్డర్‌లో అడ్డుకున్నారు. అందుకే రోడ్డు మీద పడుకొని నిరసన తెలిపాను. గతేడాది అక్టోబర్లో విశాఖపట్నంలో మనల్ని ఇబ్బందులకు గురి చేస్తే చంద్రబాబు మద్దతిచ్చారు.. ఇప్పుడు ఆయనకూ అలాంటి పరిస్థితే ఎదురైనప్పుడు స్పందించడం మన సంస్కారం. దానిలో భాగంగానే మద్దతు ఉంటుందని చెప్పాను. వారాహి యాత్ర సమయంలో కోనసీమలో అల్లర్లు సృష్టించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించాలని 2 వేల మంది నేరగాళ్లను వైసీపీ నేతలు దింపారు. కోనసీమ జిల్లాలో 50 మందిని చంపేయాలని పథకం వేశారు. శాంతిభద్రతల సమస్య సృష్టించేందుకు కుట్ర పన్నారు. వైసీపీ నాయకులు ఎన్ని పన్నాగాలు పన్నినా భయపడేవారెవరూ లేరు' అని అన్నారు. గతంలో రాజకీయాలు సిద్ధాంతపరమైన పోరాటాలుగా ఉండేవని.. వైసీపీ దానిని మార్చేసిందని పవన్ తెలిపారు. తన విధానాలను ప్రశ్నించే వారిపై దాడులకు తెగబడుతూ భౌతిక దాడుల రాజకీయాలు చేస్తోందని ఆక్షేపించారు. 'ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదని అన్నందుకు వైసీపీ అల్లకల్లోలం సృష్టిస్తోంది. రెండేళ్లు జైల్లో ఉన్న వ్యక్తి, దేశంలోనే ధనిక సీఎం. ఆయన

- మిగతా 2వ పేజీలో

# సంపాదకీయం



## జర్నలిస్టు రచయిత

ప్రపంచంలోని గొప్ప రచయితల్లో కొంతమంది వృత్తిరీత్యా జర్నలిస్టులుగా పనిచేశారు. ఒక రచయిత జర్నలిస్టు అయితే తన రోజువారీ 'స్టోరీ'లకు కథనబలాన్ని ఇవ్వగలడు. కానీ తమలోని రచయితనూ, జర్నలిస్టునూ వేరుగా ఉంచుకోవడానికే చాలామంది ప్రయత్నించారు. అనివార్యంగా ఆ రెండు పాత్రలూ కలిసిపోయే సందర్భాలు రావొచ్చు. అయితే, పూర్తి స్పృహతో తనలోని రచయితతో జర్నలిస్టును మేళవించినవాడు ట్రూమన్ కపోటి. ఆ మేళన ఫలితంగా నాన్%--%ఫిక్షన్ నవల ఉద్భవించింది. సాహిత్యానికి ఒక కొత్త ప్రక్రియను 'పరిచయం' చేసిన ట్రూమన్ కపోటి (30 సెప్టెంబర్ 1924 %--% 25 ఆగస్టు 1984) శతజయంతి సంవత్సరానికి ప్రారంభం ఇది. యూఎస్‌లోని లూసియానా రాష్ట్రంలో జన్మించిన ట్రూమన్ కపోటీ ఐదేళ్లప్పుడే బడికి నిఘంటువు మోసుకెళ్లేవాడు. ఎనిమిదేళ్ల వయసులోనే రచయిత అవుతాననుకున్నాడు. చాలామందికి జీవితం సగం ముగిసేదాకా తమకు ఏం కావాలో తెలీదు. కానీ తాను ఆ కోవలోకి చెందని ప్రత్యేక జీవినని కపోటికి తెలుసు. 'ద న్యూయార్కర్' సహా ఇతర పత్రికలకు పనిచేస్తూనే, కథలు రాశాడు. ఇరవైల్లోకి వచ్చేనాటికే ఆయన సెలబ్రిటీ. 'ఆధునిక సాహిత్యపు ఆశాదీపం' అని మెచ్చుకున్నాడు సోమర్‌సెట్ మామ్. 'బ్రేక్‌ఫాస్ట్ ఎట్ టిఫనీస్' (1958) నవలికతో కపోటి పేరు మార్మోగిపోయింది. రోజూ కనబడే చంద్రుడు కొన్నాళ్లుగా వార్తల్లో ఉన్నాడు. 1959లో రష్యా చంద్రుడి మీద దిగింది. అదే ఏడాది అమెరికాలో పెరోల్‌లో ఉన్న ఇద్దరు నేరస్థులు కాన్సాస్‌లోని ఒక ధనిక రైతును దోచుకోవడానికి పథకం వేశారు. ఇంట్లోకి ప్రవేశించి, యజమాని, ఆయన భార్య, వాళ్ల ఇద్దరు కౌమార కూతుళ్లను బంధించారు. తీరా నగదు రూపంలో ఏమీ దొరకదు. కేవలం సాక్ష్యంగా మిగిలిపోతారని నలుగురినీ హత్య చేశారు. అది అమెరికాలో పెను సంచలనం సృష్టించిన నేరవార్తల్లో ఒకటి. దాని ఆధారంగా ఆరేళ్ల పరిశోధన అనంతరం 'ఇన్ కోల్డ్ బ్లడ్' (1965) రాశాడు కపోటి. దీనికి వాడిన కథనాత్మక పాత్రికేయ టెక్నిక్‌ను 'నాన్‌ఫిక్షన్ నవల' అన్నాడు. జర్నలిజం, కథనం కలిసి కొత్త కళారూపానికి దారి తీయగలదని భావించాడు. సృష్టించే సామర్థ్యం ఉన్నప్పుడు, వాస్తవ కథనం కోసం శ్రమ పడటం దేనికి అన్న వైఖరి కొందరు రచయితల్లో ఉంటుంది. సీరియస్ రచయితల కళాత్మక స్థాయికి జర్నలిజం తగనిది అన్న అభిప్రాయమూ ఉండకపోదు. ఇదంతా కాదన్నా, ఒక మనిషి వ్యక్తిత్వాన్ని వడగట్టి రచనలోకి తేవడం అంటే చాలా రకాలుగా సిద్ధపడాలి. 'బ్రేక్‌ఫాస్ట్ ఎట్ టిఫనీస్' తన క్యారెక్టర్‌నే పెట్టి రాశాడని ఒకావిడ 8 లక్షల డాలర్లకు తెచ్చిన (విఫల) దావాను ఎదుర్కొన్న చేదు అనుభవం అప్పటికే కపోటికి ఉంది. పైగా, ఎంత నిజజీవిత కథనానికైనా ఊహాశక్తి లేకపోతే ప్రాణం పోయలేము. 'లిటెరరీ ఫొటోగ్రాఫర్'లా సూక్ష్మాంశాలను మనసులోకి ఎక్కించుకోవాలి. 'హ్యూమన్ టేప్ రికార్డర్'లా మారాలి. మరి విషయ సేకరణ ఎట్లా? తలుపులు తట్టడం సరే, వాళ్ల మనసులను మీటడం ఎలా? కపోటి ముందు ఆ ప్రాంతానికి వెళ్లి, అక్కడ కొన్నాళ్లు ఉన్నాడు. ఒక ఇంటర్వ్యూలా మాట్లాడితే అసౌకర్యం కాబట్టి, టేప్ రికార్డర్లు ఉపయోగించలేదు. వెళ్లేముందు ఒక సాధన చేశాడు: స్నేహితుడు ఓ పుస్తకంలోని పేజీలను చదివి వినిపిస్తాడు. దాన్ని కపోటి విని, తిరిగి రాసేవాడు. 'దాదాపు 95 శాతం కచ్చితత్వం' సాధించాడు. ఇన్ని చేసినా వార్తా కథనాలకు కాలం చెల్లిపోయే ప్రమాదం ఎక్కువ. వాస్తవ ఘటన ఒక తార్కిక ముగింపునకు వస్తే తప్ప రచనను ముగించలేం. ఈ సందర్భంలో తార్కిక ముగింపు అంటే, నేరస్థుల ఉరిశిక్ష అమలు కావడమే. రచయిత ఆ క్షణం కోసం ఎదురుచూడాలి.

'ఇది హింస,' అంటాడు కపోటి. ఆఖరికి 6,000 పేజీల నోట్సుతో–హంతకులు, బాధితులు, గ్రామీణ సమాజపు మనుషులు–మూడు కోణాల్లో చిత్రించిన 340 పేజీల 'ఇన్ కోల్డ్ బ్లడ్' తక్షణ బెస్ట్ సెల్లర్‌గా, కపోటి అత్యుత్తమ రచనగా సాహిత్య చరిత్రలో నిలిచిపోయింది. నాన్–ఫిక్షన్ నవల అనే ప్రక్రియను తాను పరిచయం చేయడం అనడం కంటే, అప్పటికే ఉన్నదాన్ని తాను అత్యున్నత స్థితికి తీసుకెళ్లానని మాత్రమే అనేవాడు కపోటి. చిన్నతనంలోనే తల్లిదండ్రులు విడిపోవడంతో, బంధువుల ఇంట్లో పెరిగాడు కపోటి. ఎప్పుడూ వ్యాకులతతో ఉండేవాడు. ఆయన ఒంటరితనంలో స్నేహపు సెలయేరు పొరుగున ఉండే హార్పర్ లీ. అనంతర కాలంలో 'టు కిల్ ఎ మాకింగ్‌బర్డ్' నవలా రచయిత్రి. అందులోని 'డిల్' పాత్రను ఆమె కపోటి నమూనాగా తీర్చిదిద్దారు. కపోటి రచన 'అదర్ వాయిసెస్, అదర్ రూమ్స్'లో ఇడాబెల్ పాత్రకు లీ ప్రేరణగా నిలిచారు. వారి బాల్య స్నేహం చివరిదాకా కొనసాగింది. 'ఇన్ కోల్డ్ బ్లడ్' క్షేత్రస్థాయి పరిశోధనలో లీ సహాయం చేశారు. ముఖ్యంగా ఇంటర్వ్యూలు సాధించడంలో. హోమోసెక్సువల్ అని ప్రకటించుకున్న కపోటి, దాని తాలూకు తిరస్కరణను ఎదుర్కొన్నాడు. ఆ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. తన జీవితాన్ని పునర్నిర్మించుకునే అవకాశమే ఉంటే, వ్యాకులత లేకుండా చూసుకుంటానన్నాడు. 'ఒక కథను ఎంత సహజంగా చెప్పవచ్చో ఆ రూపాన్ని రచయిత కనుక్కున్నాడనేదానికి పరీక్ష ఏమిటంటే ఆ కథ చదివాక, నువ్వు దాన్ని ఇంకోలా ఊహించగలుగుతున్నావా లేక అది నీ ఊహను నెమ్మదించేలా చేసి, అదే సంపూర్ణమూ, అంతిమమూ అనిపిస్తోందా? ఒక నారింజ ఫలాన్ని ప్రకృతి సరిగ్గా ఎలా చేసిందో అలా' అన్నాడు కపోటి. సాహిత్య జీవితం గురించి సరేగానీ, అరవై ఏళ్లు నిండకుండానే కన్నుమూసిన కపోటి జీవితం సంపూర్ణ ఫలమేనా అంటే చెప్పడం కష్టం!



# మండలిని విస్తరించాలి



### ఐరాసతో సహా అన్ని అంతర్జాతీయ సంస్థలను సంస్కరించాలి
### నేటి ప్రపంచ వాస్తవికతకు అనుగుణంగా మార్పులు ఉండాలి
### ప్రపంచానికి సమస్యలుగా సైబర్ సెక్యూరిటీ, క్రిప్టో కరెన్సీలు
### జీ–20 సదస్సులో ప్రధాని మోదీ.. ముగిసిన సమావేశాలు
### కూటమి తదుపరి అధ్యక్ష బాధ్యతలు బ్రెజిల్‌కు అప్పగింత

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: నేటి పరిస్థితులకు అనుగుణంగా ఐక్యరాజ్యసమితితో పాటు అన్ని అంతర్జాతీయ సంస్థలను సంస్కరించాల్సిందేనని ప్రధాని మోదీ నొక్కిచెప్పారు. ప్రధానంగా ఐరాస భద్రతా మండలి(యూఎన్ఎస్‌సీ)ని విస్తరించాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడ్డారు. ఐరాసలో సభ్యదేశాల సంఖ్య పెరుగుతున్నప్పటికీ.. భద్రతా మండలిలో మాత్రం సభ్య దేశాల సంఖ్య మారడం లేదని అన్నారు. ప్రపంచాన్ని మరింత మెరుగైన భవిష్యత్తు దిశగా నడిపించేందుకు నేటి ప్రపంచ వాస్తవికత పరిస్థితులకు అనుగుణంగా మార్పులు ఉండాలని అభిప్రాయపడ్డారు. భారత్ అధ్యక్షతన ఢిల్లీలో రెండు రోజులుగా జరుగుతున్న జీ20 దేశాల శిఖరాగ్ర సమావేశాలు ఆదివారం సాయంత్రంతో ముగిశాయి. ఈ సందర్భంగా అంతకు ముందు 'వన్ ఫ్యూచర్' సెషన్‌లో మోదీ మాట్లాడుతూ ఐరాస భద్రతా మండలిని సంస్కరించాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. ఐరాస ఏర్పడినప్పుడు, ఇప్పటితో పోలిస్తే అప్పటి ప్రపంచ పరిస్థితులు వేరని, ఆ సమయంలో సభ్య దేశాలు 51 మాత్రమే ఉన్నాయని తెలిపారు. అయితే నేడు ఐక్యరాజ్యసమితిలో సభ్యదేశాల సంఖ్య దాదాపు 200కు చేరువైందని, అయితే యూఎన్ఎస్–సీలో శాశ్వత సభ్య దేశాల సంఖ్య మాత్రం మారలేదని అభిప్రాయపడ్డారు. రవాణా, కమ్యూనికేషన్, ఆరోగ్యం, విద్య.. ఇలా అన్ని రంగాల్లో మార్పులు వచ్చాయని, ఇందుకు అనుగుణంగా మన కొత్త ప్రపంచ నిర్మాణం కూడా ఉండాలని, ఆ దిశగా తక్షణ నిర్ణయాలు ఉండాలని మోదీ పేర్కొన్నారు. జీ20 గ్రూపు తదుపరి అధ్యక్ష బాధ్యతలను బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డాసిల్వాకు ప్రధాని మోదీ అప్పగించారు. దీనికి గుర్తుగా చిన్న సుత్తి వంటి గవెల్‌ను ఆయన చేతికి అందజేశారు. ఈ సందర్భంగా డాసిల్వా మాట్లాడుతూ వర్ధమాన దేశాల ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై మాట్లాడేందుకు అవకాశం ఇచ్చిన భారత్‌ను ప్రశంసించారు. జీ20 సదస్సు ముగింపు నేపథ్యంలో అన్ని దేశాల అధినేతలు భారత జాతిపిత మహాత్మాగాంధీకి నివాళులర్పించారు. అమెరికా అధ్యక్షుడు బైడెన్, బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ తదితర నేతలు రాజ్‌ఘాట్‌కు వెళ్లి గాంధీ స్మారకం వద్ద కొంతసేపు మౌనం పాటించారు. వీరిని ప్రధాని మోదీ అక్కడకు తోడ్కొని వెళ్లారు.

#### నవంబర్‌లో వర్చువల్ సమావేశం

సైబర్ భద్రత, క్రిప్టో కరెన్సీలు వంటి కీలక సమస్యలు నేటి, భవిష్యత్తు ప్రపంచాన్ని ప్రభావితం చేస్తున్నాయని మోదీ అన్నారు. క్రిప్టోను నియంత్రించేందుకు అంతర్జాతీయ ప్రమాణాలు తీసుకు రావాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడ్డారు. టెర్రరిజం ఫండింగ్‌కు సైబర్ స్పేస్ కొత్త వనరుగా ఆవిర్భవించిందని, దీన్ని అరికట్టేందుకు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. కాగా, జీ20 సదస్సులో తీసుకొన్న నిర్ణయాలు, తీర్మానాలపై సమీక్ష చేసేందుకు ఈ ఏడాది నవంబర్‌లో వర్చువల్‌గా సమీక్ష సమావేశం నిర్వహణను మోదీ సదస్సు ముగింపు ప్రసంగం సందర్భ ంగా ప్రతిపాదించారు. భారత్‌కు జీ20 అధ్యక్ష బాధ్యతలు అధికారికంగా నవంబర్ 30 వరకు కొనసాగుతాయన్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు



# హైదరాబాద్‌లో భారీ వర్షం!

హైదరాబాద్‌లో పలుచోట్ల భారీ వర్షం కురిసింది. ఆదివారం మధ్యాహ్నం నుంచి పలు ప్రాంతాల్లో కుండపోతతో వరదలు రహదారులను ముంచేశాయి. పలు ప్రాంతాల్లో వరద నీరు నిలిచి ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. లంగర్‌హౌస్, ముషీరాబాద్ ప్రాంతాల్లో అత్యధికంగా 4.3 సెం.మీ. వర్షం కురిసింది. మియాపూర్, కుత్బుల్లాపూర్, బేగంపేట బ్రాహ్మణవాడి, ముషీరాబాద్, యూసుఫగూడ కృష్ణానగర్, నిజాంపేట, గాజులరామారంలోని లోతట్టు ప్రాంతాల్లో భారీగా వరద నీరు రోడ్లపైనే నిలిచిపోవడంతో స్థానికులు వణికి పోయారు. సికింద్రాబాద్, చార్మినార్, లిబర్టీ, కోఠి, ఉప్పల్, దిల్‌సుఖ్‌నగర్, మణికొండ తదితర ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి అక్కడి వారు ఇబ్బందులు పడ్డారు. లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన వరద నీటిని తొలగించేందుకు జీహెచ్ఎంసీ డిజాస్టర్ బృందాలు రంగంలోకి దిగాయి.



#### నేడు, రేపు వర్షాలు..

రాష్ట్రంలో రెండ్రోజుల పాటు (సోమ, మంగళవారాల్లో) తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. మంగళవారం నాటికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఒక ఉపరితల ఆవర్తనం ఏర్పడే అవకాశముందని తెలిపింది. వాయవ్య మధ్యప్రదేశ్, ఈశాన్య రాజస్థాన్‌పై ఉన్న ఉపరితల ఆవర్తనం నుంచి ఒక ద్రోణి దక్షిణ ఛత్తీసగఢ్ వరకు సముద్రమట్టం నుంచి 4.5 కిలోమీటర్ల వరకు కొనసాగుతున్నట్లు వివరించింది.

## మీరు ఆ నియోజకవర్గాలకే సీఎం, మంత్రులా?

(మొదటి పేజీ తరువాయి)

మొత్తం 35 వేల పోలింగ్ బూత్‌లు ఉన్నాయని, ఈ నెల 17న తుక్కుగూడలో జరగనున్న కాంగ్రెస్ జయభేరి సభకు ప్రతి బూత్ నుంచీ జనం తరలి వచ్చేలా చూడాలని డీసీసీ అధ్యక్షులకు టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి సూచించారు. ప్రతి ఒక్కరూ సమన్వయం చేసుకుని సభను విజయవంతం చేయాలన్నారు. పది లక్షల మందితో తుక్కుగూడ సభను నిర్వహించాలని పార్టీ నిర్ణయించిన నేపథ్యంలో సభా ఏర్పాట్లపైన రాష్ట్రంలోని అన్ని జిల్లాల పార్టీ అధ్యక్షులతో ఆదివారం రేవంత్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, సీఎల్పీ నేత భట్టివిక్రమార్క, కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేషకుమార్‌గౌడ్‌లు జూమ్ యాప్ ద్వారా సమావేశమయ్యారు. రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. జయభేరి సభకు సంబంధించి ఈ నెల 11 నుంచి రాష్ట్రంలోని అన్ని మండలాల్లో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. సోమవారం పార్లమెంటు అబ్జర్వర్లు, టీపీసీసీ ఉపాధ్యక్షులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

## మణిపూర్ ఘర్షణలకు బీజేపీ రాజకీయ అండ

సహజ సంపద, వనరులు లూటీ చేయాలనే కార్పొరేట్ల దురాశకు బీజేపీ నేతృత్వంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రాజకీయ అండదండలే మణిపూర్‌లో జాతుల మధ్య ఘర్షణలకు ప్రధాన కారణమని సీపీఐ పార్లమెంటరీ పార్టీ నాయకుడు, ఆ పార్టీ జాతీయ కార్యదర్శి బినోయ్ విశ్వం ఆరోపించారు. బీజేపీ కుటిల, సంకుచిత రాజకీయాలకు మణిపూర్ ప్రజలు మూల్యం చెల్లిస్తున్నారని, అక్కడ హింసకు ముగింపు ఎప్పుడో తెలియడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. విశాలాంధ్ర పూర్వ సంపాదకుడు సి.రాఘవాచారి జయంతిని పురస్కరించుకొని బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఆదివారం నీలం రాజశేఖర రెడ్డి పరిశోధన కేంద్రం, సీఆర్ ఫౌండేషన్, రాఘవాచారి ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో 'మణిపూర్ ఒక రాజకీయ విశ్లేషణ' అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా బినోయ్ విశ్వం మాట్లాడుతూ.. మణిపూర్‌లో ఘర్షణలు ప్రారంభమైనప్పటి నుంచి ప్రధాని మోదీ అనేక దేశాల్లో పర్యటించారే తప్ప మణిపూర్ మాత్రం వెళ్లలేదన్నారు. అక్కడ జరుగుతున్నది కేవలం ఆర్థిక, సాంస్కృతిక, జాతుల సంఘర్షణ మాత్రమే కాదని, వీటి వెనుక కార్పొరేట్ శక్తుల ప్రమేయం, ధనదాహం ఉందని ఆరోపించారు. మణిపూర్ కొండల్లోని అపార ఖనిజ సంపదపై అదానీ కన్నుపడిందని, ఆయనకు లాభం చేకూర్చేందుకు బీజేపీ ప్రభుత్వాలు జాతుల ఘర్షణకు తెరలేపాయన్నారు. సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ డబుల్ ఇంజన్ సర్కార్ ఉన్న మణిపూర్‌లో ఘర్షణ మంటలు ఆరడంలేదని విమర్శించారు. సదస్సులో ఐజేయూ జాతీయ అధ్యక్షుడు కె.శ్రీనివాసరెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఐడీపీడీ ఉపాధ్యక్షులు డాక్టర్ రజిని, మాజీ ఎమ్మెల్సీ జె.చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.

# జగిత్యాల అసెంబ్లీ బీజేపీ అభ్యర్థిగా డా''నరేంద్ర పన్నీరు దరఖాస్తు

**జగిత్యాల, సమ సమాజం:** జగిత్యాల శాసనసభ నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు టికెట్ కేటాయించి అవకాశం ఇవ్వాలని హైదరాబాద్ లోని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం గల్ఫ్ జేఏసీ నాయకులు, తెలంగాణ బిజెపి ఎన్నారై సెల్ గల్ఫ్ మిడిల్ ఈస్ట్ కన్వీనర్ డాక్టర్ నరేంద్ర పన్నీరు దరఖాస్తు చేసుకున్నారు. స్థానికుడు, బాల్యం నుండి స్వయం సేవకునిగా,అఖిల భారత విద్యార్థి పరిషత్ లో విద్యార్థి నాయకుడు గా పనిచేసిన అనుభవం ఉన్న నరేంద్ర పన్నీరు ప్రస్తుతం తెలంగాణ బిజెపి ఎన్నారై సెల్ గల్ఫ్, మిడిల్ ఈస్ట్ కన్వీనర్ గా కొనసాగుతూ భారతీయ జనతా పార్టీ ని గల్ఫ్ దేశాలలో ఉన్న తెలంగాణ కార్మికులను, కార్యకర్తలను సమన్వయం చేస్తూ పార్టీ అభివృద్ధి లో భాగమై అంకిత భావం తో గత ముప్పై సంవత్సరాల నుండి పార్టీలో ఉంటూ పార్టీకే జీవితం అంకితం అంటూ నరేంద్ర పన్నీరు గల్ఫ్ కార్మికుల హక్కుల కోసం తనకు ఎన్నారై కోటా లో జగిత్యాల అసెంబ్లీ అభ్యర్థి గా టిక్కెట్, బి ఫామ్ ఇచ్చి అవకాశం కలిపించాలని ఈమెరకు అధిష్టానానికి విజ్ఞప్తి చేసారు.కల్వకుంట్ల కుటుంబం చేతిలో తెలంగాణ,గల్ఫ్ కార్మికులు వారి కుటుంబాల జీవితాలు ఆగం అయ్యాయని. వచ్చేది బిజెపి ప్రభుత్వం మాత్రమే అని గల్ఫ్ కార్మికుల చిరకాల స్వప్నమైన గల్ఫ్ బోర్డ్ బిజెపి తోనే సాద్యం అని అన్నారు.తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ లో గల్ఫ్ కార్మికుల వాయిస్ వినిపిస్తూ అనగారిన గల్ఫ్ కుటుంబాల హక్కులకై, నియోజకవర్గం అభివృద్ధికై శక్తివంచన లేకుండా దీటైనా పోరాటం కొనసాగిస్థానని నరేంద్ర పన్నీరు తేల్చిచెప్పారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ బిజెపి నాయకులు వంకాయల కార్తిక్, పిట్ల రాజు, బీర్పూర్ మండల ఓబీసీ అధ్యక్షుడు బసవరాజుల సంతోష్, మండల





ఉపాధ్యక్షుడు గోస్కుల రాకేశ్, శ్రీనివాస్, రాజ్,గల్ఫ్ జేఏసీ నాయకులు, ఎన్నారై సెల్, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## శ్రావణమాస ఏకాదశి సామూహిక కుంకుమార్చన



**జగిత్యాల, సమ సమాజం:** శ్రావణమాసం ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణ వీధి శ్రీరామ మందిరంలో శ్రీ హనుమాన్ చాలీసా భక్త బృందం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం మాతలచే సామూహిక కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. మాతలు విశేష సంఖ్యలో పాల్గొని శ్రీలక్ష్మి అష్టోత్తరాన్ని పటిస్తూ కుంకుమార్చనను కొనసాగించారు. వైదిక క్రతువును సంగనభట్ల నరేంద్ర శర్మ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ రామ మందిరమును సాంప్రదాయ బద్ధంగా అలంకరించారు. అమ్మవారి నామస్మరణతో మారు మోగింది. విచ్చేసిన మాతలకు తీర్థ ప్రసాదంతో పాటు కుంకుమార్చన నిర్వహించిన పసుపు, కుంకుమ అందజేసి ఆశీర్వచనం చేశారు.

## చాకలి ఐలమ్మ స్ఫూర్తిని కొనసాగించాలి

**పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి**



**జగిత్యాల,సమ సమాజం:** తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని జగిత్యాల లోని చింతకుంట వద్ద గల చాకలి ఐలమ్మ విగ్రహానికి ఆదివారం పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తన హక్కుల కోసం అనాటి భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం చేసిన ధీర వనిత చాకలి ఐలమ్మ ధైర్యాన్ని రజకులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. నమ్మిన సిద్ధాంతం కోసం తమ హక్కుల సాధనతోపాటు, బానిస బతుకులు వద్దంటూ చాకలి ఐలమ్మ వెట్టి చాకిరి నిర్మూలన కోసం కృషి చేసిందని, ప్రజల్లో మానసికస్థైర్యం నింపిన, ఆదర్శవనిత, తెలంగాణ ఉద్యమానికి వేగుచుక్కగా నిలిచిందని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి చాకలి ఐలమ్మ సేవలను కొనియాడారు.

# తెలంగాణ సాయుధ పోరాట యోధురాలకు ఘన నివాళులు

**ఎల్బీనగర్ సమ సమాజం:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఎల్బీనగర్ చింతలు కుంట చెక్ పోస్ట్ వద్ద గల ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించిన బిఎన్ రెడ్డి డివిజన్ మాజీ కార్పొరేటర్ శ్రీమతి ముద్దగౌని లక్ష్మీప్రసన్న రామ్మోహన్ గౌడ్ . ఈ సందర్భంగా లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ ఆనాటి నిజాం సంస్థానంలో తెలంగాణ భాగంగా ఉండేది 1940 లలో దొరలు, దేశ్ ముఖ్ లు, దేశ్ పాండేలు, భూస్వాములు, పెత్తందార్లు, నిజాం రాజుకు కప్పం కడుతూ గ్రామాలపై అధికారం చలాయించేవారు. ప్రజలను వివిధ రకాల పన్నుల పేరుతో పీడించడం,వెట్టి చాకిరి చేయించడం చేసేవారు అన్నారు .భూమి కోసం,భుక్తి కోసం,దోపిడీ,పీడన నుంచి విముక్తి కోసం జరిగిన ఆనాటి సాయుధ రైతాంగ పోరాటంలో దొరల గడీలను చాకలి ఐలమ్మ గడగడలాడించిన్న వీర వనిత అని అన్నారు . ఈ కార్యక్రమం లో చాకలి ఐలమ్మ




ఐక్యవేదిక అధ్యక్షులు నరసింహ్మ , ప్రధాన కార్యదర్శి చంద్రయ్య , సహాయకార్యదర్శులు యాదగిరి , అంజయ్య , ఉపాధ్యక్షులు సాయిలు , శ్రీనివాస్ , కోశాధికారి శ్రీరామ్ , మల్లేష్ , వెంకటేష్ ,ఈశ్వర్ , అంజయ్య , కోటేష్ తదితరులు పాల్గొన్నారు .

# తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలుకు ఘన నివాళులు

**చాకలి ఐలమ్మ 38వ వర్ధంతి సభ**

**రజక వృత్తిదారుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు నల్లూరి రామలింగం, జిల్లా కార్యదర్శి పున్న%శీ% సారయ్య**

**తొర్రూరు సమ సమాజం:** తెలంగాణ సాయిధ పోరాట యోధురాలు స్త్రీ శక్తికి నిలువెత్తు నిదర్శనం వీరనారి చాకలి (చిట్యాల) ఐలమ్మ అని, ప్రతి ఒక్కరూ ఆమె స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని ఐలమ్మ పోరాట స్ఫూర్తితో తమ హక్కులను సాధించుకునేందుకు ఉద్యమాలకు సిద్ధం కావాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు నల్లూరి రామలింగం, జిల్లా కార్యదర్శి పున్నం సారయ్య లు పిలుపునిచ్చారు. ఆదివారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద వీరనారి చాకలి ఐలమ్మ 38వ వర్ధంతి సభను తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్ధంతి సభకు విశిష్ట అతిథిగా జిల్లా రైతు సమన్వయ సమితి సభ్యులు బారాస రాష్ట్ర నాయకులు రామ సహాయం కృష్ణ కిషోర్ రెడ్డి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటుచేసిన ఐలమ్మ వర్ధంతి సభలో చేతివృత్తి దారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ బొల్లం అశోక్, నల్లూరి రామలింగం, పున్నం సారయ్యలు మాట్లాడుతూ ఒకప్పటి చెన్నూరు నియోజకవర్గం ప్రస్తుత పాలకుర్తి నియోజకవర్గం లోనీ కిష్టాపురం గ్రామంలో పుట్టి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో విరోచిత పోరాటం చేసిన యోదురాలు చిట్యాల ఐలమ్మ అని కొనియాడారు. రజక వృత్తిదారులంతా ఐక్యంగా ఉండి ఐలమ్మ పోరాటస్ఫూర్తితో తమ హక్కులను సాధించుకోవడానికి ఉద్యమించాలని రజక వృత్తిదారులను కోరారు. రజక వృత్తిని కోల్పోయి రజకులంతా పట్టణాలకు వలస వెళ్లి పూట గడవని పరిస్థితుల్లో రజక వృత్తిదారులు బ్రతుకు వెళ్లదీస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణాలలో రజక వృత్తిదారుల మహిళలు ఇండ్లలో పనిచేస్తుంటే లేనిపోని నిందలు వేయడమే కాకుండా రజకులను కించపరచడమే కాకుండా అత్యాచారాలు జరిగిన సంఘటనలు కూడా ఉన్నాయని అన్నారు. మహిళా రజక వృత్తిదారుల కోసం రజకులకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకు



రావాలని, 50 ఏళ్లు నిండిన రజక వృత్తిదారులకు పెన్షన్ పథకం వర్తింపజేసే విధంగా చర్యలు తీసుకోవాలని, రజక వృత్తిదారులకు ఉచిత విద్యుత్ పథకం ఎల్టి2 నుండి ఎల్టి4 వరకు మార్చాలని, రజక వృత్తిదారుల కుటుంబాలు అందరికీ రెండు పడక గదుల ఇల్లు ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలని, రాష్ట్ర రాజధాని ట్యాంక్బండ్ పై, తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలలో వీరనారి ఐలమ్మ విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రజక వృత్తిదారులకు ప్రభుత్వ కార్యాలయాలు, హాస్టల్లు, ఆసుపత్రులు తదితర వాటిలో రజక వృత్తిదారులకే దోబీ కాంట్రాక్టులు ఇవ్వాలని అన్నారు. రజకులు రజక వృత్తిదారులు సంఘటితంగా తమ హక్కుల సాధన కోసం ఐలమ్మ పోరాట స్ఫూర్తితో సాధించు కోవడానికి ముందుకు రావాలని రజకులను రజక వృత్తిదారులను కోరారు. ఈ కార్యక్రమంలో రజక వృత్తిదారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గొల్లపల్లి వెంకటేష్, తొర్రూరు మండల అధ్యక్షుడు నిమ్మల సోమయ్య, కార్యదర్శి పొడగంటి శేఖర్, సహాయ కార్యదర్శి చింతల మధు, సంఘం నాయకులు లోకుంట్ల రాములు, సంతోష్, రామకృష్ణ, రాజు, కార్తీక్, చింతల వెంకన్న, సైదులు, ఉప్పలయ్య, బిక్షం, మురళి, అంజయ్య, కృష్ణ, నరేష్, చరణ్ తదితరులు రవీందర్ పాల్గొన్నారు.

# ఘనంగా పలివెలలో బోనాలు పండుగ సంబరాలు

**శ్రీ రేణుక ఎల్లమ్మ గుడి అధ్యక్షులు గోసుకొండ మారయ్య**



**మునుగోడు, సెప్టెంబర్ 10 (సమ సమాజం):** శ్రావణమాసంను పురస్కరించుకొని గ్రామస్తులు బోనాల పండుగ వేడుకలను సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో పలివెల గ్రామ ప్రజలు నిర్వహించారు. ఈ వేడుకల సందర్భంగా మహిళలు బోనాలు ఎత్తుకొని గ్రామ వీధుల్లో డప్పు చప్పులతో ప్రదర్శన నిర్వహించారు. బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీ రేణుక ఎల్లమ్మ గుడి అధ్యక్షుడు గోసుకొండ మారయ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ పలివెల గ్రామ ప్రజలు కనుల పండుగగా బోనాల పండుగ వేడుక జరుపుకున్నామని, శ్రీ రేణుక ఎల్లమ్మ, ముత్యాలమ్మల కరుణ కటాక్షములు గ్రామ ప్రజలకు ఉండాలని, ప్రజలు పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని అన్నారు. ఈ వేడుకలో రేణుక ఎల్లమ్మ గుడి ఉపాధ్యక్షులు దుబ్బ రాములు, గౌరవ అధ్యక్షుడు గోస్కొండ ముత్తయ్య, కోశాధికారి గోస్కొండ కృష్ణయ్య, గోస్కొండ స్వామి, గోస్కొండ లక్ష్మీపతి, నవీన్, రవివర్మ, స్వామి, మధు, నరేష్, భరత్ మొదలగు భక్తులు పాల్గొన్నారు.



# తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ పాత్ర మరువలేనిది

**శేరిలింగంపల్లి,సమ సమాజం:** తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ చాలా ముఖ్యమై పాత్ర పోషించారని, ఆమె సేవలను ఎప్పటికీ మరువలేవని రజక సంఘం నాయకులు అన్నారు. చాకలి ఐలమ్మ 38వ వర్ధంతి సందర్భంగా ఆదివారం రోజు శేరిలింగంపల్లి నియోజకవర్గం లోని మియాపూర్ డివిజన్ లో గల నడిగడ్డ తండాలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూతెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ పాత్ర చాలా ముఖ్యమైనదని, భూమి కోసం, భుక్తి కోసం రజాకారులను ఎదిరించి పోరాడి పేద ప్రజల పట్ల నిలబడ్డ వీరవనితగా నిలిచారని అందుకు గర్వంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో బస్తి పెద్దలు మరియు రజక రాజు, రజక సురేష్, రజక నరసింహ, రజక మల్లేష్, రజక వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.





# క్రమశిక్షణ మారుపేరు ఎన్సిసి కల్నల్ అజయ్ ఆనంద్ కడారి

**ఆలేరు సమ సమాజం:** క్రమశిక్షణకు మారుపేరు ఎన్సిసి అని క్యాంపు కమాండెంట్ అన్నారు వరంగల్ పోలీస్ శిక్షణ కళాశాలలో ఈ నెల ఒకటో తేదీ నుండి జరిగిన ఆరవ కంబైన్డ్ అన్యువల్ ట్రైనింగ్ క్యాంప్ ఆదివారం జరిగిన సర్టిఫికెట్ ప్రధాన కార్యక్రమం సందర్భంగా ఆయన మాట్లాడారు ఈ శిక్షణ శిబిరంలలో క్రమశిక్షణతో పాటు దేశభక్తి అలవాడి దేశ అభివృద్ధి లోపాలు పంచుకోవాలని అన్నారు జాతీయ సమైక్యత నాయకత్వ లక్షణాలు పెంపొందించుకొని ఉత్తమ లక్షణాలను గల యువతగా తయారు కావడానికి ఈ ఎన్సిసి శిబిరాలు ఉపయోగపడుతుందని అన్నారు ఇటువంటి అవకాశాన్ని సద్వినియోగం పంచుకొని విద్యార్థులు తమ బావ జీవితానికి బంగారు బాట వేసుకోవాలని అన్నారు ఎన్సిసి ద్వారా ఆత్మవిశ్వాసం పెరుగుతుందని దీని ద్వారా భవిష్యత్తులో ఏదైనా సాధిస్తేన నే నమ్మకం ద్వారా దేశం కోసం పనిచేయాలని ఆలోచన కలుగుతుందని అన్నారు

# డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు స్థానికులకే కేటాయించాలి

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు డా.ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్
- తుక్కుగూడలో స్థానికుల ధర్నాకు మద్దతు
- అనర్హులకు ఇండ్లు కేటాయింపులో మంత్రి సబితా ఇంద్రారెడ్డి రెడ్డి హస్తం



**తుక్కుగూడ సమ సమాజం:** అర్హులందరికీ డబుల్ బెడ్ రూం ఇండ్లు కేటాయిస్తామని చెప్పిన బీఆర్ఎస్ ప్రభుత్వం, స్థానికేతరులైన అనర్హులకు కేటాయించి పేదలను మోసం చేస్తుందని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డా.ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగుడ మున్సిపాలిటీలో స్థానికులకే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని స్థానికులు చేస్తున్న ధర్నాకు ఆదివారం ఆయన మద్దతు తెలిపారు. మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రోత్బలంతో స్థానికులకు అన్యాయం చేస్తూ,స్థానికేతరులకు ఇండ్లు కేటాయిస్తున్నారని ఆరోపించారు. తుక్కుగూడ పరిధిలో ఫేస్ -%×% కింద 10 ఎకరాల భూములో 832 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను, ఫేస్ -%××% కింద 12 ఎకరాల్లో 2016 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిర్మించి స్థానికులకు అన్యాయం చేస్తూ, స్థానికేతరులకు కేటాయించారు. భూములు కోల్పోయింది స్థానికులైతే మంత్రి సబితా ఇంద్రారెడ్డి రెడ్డి రాజకీయ ప్రయోజనాల కోసం స్థానికేతరులకు ఇండ్లు కేటాయిస్తున్నారని ఆరోపించారు. బడంగ్ పేట్ లో పేదల భూములను గుంజుకొని, భూములు కోల్పోయిన బాధితులకు కేవలం 60 గజాల స్థలాన్ని కేటాయించి అన్యాయం చేసిందని మంత్రిని విమర్శించారు. తక్షణమే డబుల్ బెడ్ రూం ఇండ్లను స్థానికులకే ఇవ్వాలని డిమాండ్ చేసారు. తమ న్యాయమైన డిమాండ్ కోసం ధర్నా చేస్తున్న స్థానికులను పోలీసులు అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. హైదరాబాద్ చుట్టూ ఉన్న పేదల అసైన్డ్ భూములను బలవంతంగా గుంజుకొని ఇండస్ట్రియల్ పార్కులకు కేటాయిస్తున్నారని విమర్శించారు.తుక్కుగూడలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో జరిగిన అవకతవకలపై పూర్తి విచారణ జరిపి స్థానికులకే ఇండ్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ధర్నాలో పాల్గొన్న వారిలో రంగారెడ్డి తూర్పు, పడమర జిల్లా అధ్యక్షులు పంది లింగం,రాచమల్ల జయసింహ,గుడ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### ఆత్మగౌరవానికి ప్రతీక చాకలి ఐలమ్మ

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు డా.ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ తెలంగాణలో దొరల గడీల పాలనకు వ్యతిరేకంగా భూమి కోసం, భుక్తి కోసం తిరుగుబాటు చేసిన ధీరవనిత చాకలి ఐలమ్మ అని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డా.ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ కొనియాడారు.చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం తుక్కుగూడలో ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐలమ్మ చేసిన పోరాటం తెలంగాణలోని బహుజనుల ఆత్మగౌరవానికి మహిళా చైతన్యానికి ప్రతీక అని అన్నారు.ఆమె ప్రజాస్వామిక పోరాట స్ఫూర్తితో తెలంగాణలో దొరల గడీల పాలనను కూల్చి, బహుజన రాజ్యం నిర్మించేందుకు బహుజనులందరూ ఏకం కావాలని పిలుపునిచ్చారు.

## శేరిలింగంపల్లి నియోజకవర్గం లో ఎగిరేది బీజేపీ జెండానే

**గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి**

**బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థిగా దరఖాస్తు చేసుకున్న రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్**



**శేరిలింగంపల్లి,సమ సమాజం:**శేరిలింగంపల్లి నియోజకవర్గం నుండి బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థిగా భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ దరఖాస్తు చేసుకున్నారు .ఈ సందర్భంగా రవి కుమార్ యాదవ్ మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గం లో బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను నామరూపం లేకుండా చేసి అత్యంత మెజార్టీతో భారతీయ జనతా పార్టీ గెలుపుకు కృషి చేస్తానని ,ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తూ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని తెలిపారు.ఈరోజు ఇంత పెద్ద సంఖ్యలో వచ్చిన ప్రతి ఒక్క కార్యకర్తకు, నాయకులకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని తెలిపారు. అనంతరం గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ వి.గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ కెసిఆర్ పాలన తో విసిగిపోయారని,ప్రజలు మార్పు కోరుకుంటున్నారని అన్ని అన్నారు.అందుకే రాష్ట్రంలో బిఆర్ఎస్ కు ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగిన బిజెపి వైపు ప్రజలంతా చూస్తున్నారని శేరిలింగంపల్లి నియోజకవర్గం లో కచ్చితంగా బీజేపీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం లోనీ రాష్ట్ర, జిల్లా, డివిజన్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మరియు శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కామ్రేడ్ పరికిరాల భూమయ్య మృతి పీడిత ప్రజా ఉద్యమాలకు తీరని లోటు

**యంసిపిఐ(యు) గ్రేటర్ హైదరాబాద్ కమిటీ నివాళులు**




**శేరిలింగంపల్లి, సమ సమాజం:** శేరిలింగంపల్లి లోని మియాపూర్ ముజఫర్ అహ్మద్ నగర్ ఎంసిపిఐ (యు)గ్రేటర్ హైదరాబాద్ జిల్లా కార్యాలయం గ్రేటర్ హైదరాబాద్ సహాయ కార్యదర్శి తుడుం అనిల్ కుమార్ అధ్యక్షుతన యంసిపిఐ (యు) రాష్ట్ర కమిటీ సభ్యులు, భూపాలపల్లి జిల్లా కార్యదర్శి గా భాధ్యతలు నిర్వహిస్తూ ఆదివారం నాగపూర్ లో కుమారిని ఇంటికి వెళ్ళి అనారోగ్యంతో ఆసుపత్రిలో అమరత్వం పొందిన కామ్రేడ్ పరికిరాల భూమయ్య ఫోటో కు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ గదాగోని రవి పూలమాల వేసి పార్టీ సభ్యులు అందరు నివాళులు అర్పించారు. తదనంతరం వారు మాట్లాడుతూ అతి నిరుపేద కుటుంబంలో జన్మించారు.చిన్న వయసులోనే కమ్యూనిస్టు ఉద్యమానికి ఆకర్షితులై పేద, బడుగు బలహీన వర్గాల కోసం తన జీవితాన్ని అంకితం చేసాడని వారి మృతి ప్రజా ఉద్యమాలకు యంసిపిఐయు పార్టీ కే కాకుండా యావత్ కమ్యూనిస్టు ఉద్యమం నకు ఎనలేని నష్టం అనియంసిపిఐ(యు) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి అన్నారు.కామ్రేడ్ భూమయ్య

ఎన్నో రాజకీయ ఇతర అవకాశాలు అంది వచ్చినప్పటికీ నమ్మిన సిద్ధాంతం ను విస్మరించకుండా యంసిపిఐ(యు) ద్వారా మాత్రమే ప్రజలకు సరైన ప్రత్యామ్నాయ రాజకీయాలు అందుతాయని శ్వాస చివరి వరకు పోరాడారని యంసిపిఐ(యు) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గదాగోని రవి అన్నారు.ఈ కార్యక్రమం లో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వనం సుధాకర్, వి తుకారాం నాయక్, రాష్ట్ర కమిటీ సభ్యులు తాంద్ర కళావతి, పల్లె మురళి, పి భాగ్యమ్మ,గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి వర్గ సభ్యులు ఇస్లావత్ దశరథ్ నాయక్, లసాని రాజు,గ్రేటర్ కమిటీ సభ్యులు డి మధు సూదన్, కన్నా శ్రీనివాస్, డివిజన్ నాయకులు దేవనూర్ నర్సింహా, జి శివాని, సుల్తానా బేగం, నాగభూషణం, రజియా బేగం, తదితరులు పాల్గొన్నారు.

# గురువులకు..సన్మానం



**నర్సింహులపేట,సమ సమాజం:** గురుబ్రహ్మ గురువిష్ణు గురుదేవో మహేశ్వర గురు సాక్షాత్ పరబ్రహ్మ తస్మైశ్రీ గురవే నమః విద్యాబుద్ధులు నేర్పి.. మన ఉన్నతికి తోడ్పడేది గురువు.. తల్లిదండ్రులు ఆ తర్వాత స్థానం గురువుదే.. ఎంతోమందిని తీర్చిదిద్దే గురువే మనకు స్ఫూర్తి.. ఏమిచ్చినా ఎంత ఇచ్చిన గురువు రుణం తీర్చుకోలేము..గురువులకు సన్మానం కార్యక్రమంలో ఆదివారం జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే శంకర్ నాయక్ ముఖ్యఅతిథిగా హాజరై ఉత్తమ ఉపాధ్యాయులను సన్మాసించారు.అందులో భాగంగా ట్రెస్మా ఆధ్వర్యంలో బాలాజీ గార్డెన్స్ లో గురుపూజోత్సవం సందర్భంగా నిర్వహించిన గురువులకు సన్మానోత్సవ కార్యక్రమంలో నర్సింహులపేట మండల చెందిన ఎరనాగి సుకన్య దంతాలపల్లి మండల కేంద్రంలో ఉన్న అక్షర హైస్కూల్ పనిచేస్తుంది. ఆమెకు గురుపూజోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను శాలువా, జ్ఞాపిక తో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అక్షర హైస్కూల్ కరస్పాండెంట్ యాకయ్య,వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్, ఉపాధ్యాయ బృందం మహేష్, పద్మ , భీష్మా,సంధ్యా, తదితరులు పాల్గొన్నారు.

# కొంగు కట్టి.. కొడవలి పట్టి.. పోరాడిన వీర వనిత చాకలి ఐలమ్మ:

**- ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు**

**- ఎన్ ఎస్ యు ఐ మునుగోడు నియోజకవర్గ అధ్యక్షుడు రాచకొండ భార్గవ్**

**చౌటుప్పల్,సమ సమాజం:** చీర కొంగు పైకి కట్టి.. వేట కొడవలి చేతబట్టి.. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన వీర వనిత చాకలి ఐలమ్మ అని ఎన్ ఎస్ యు ఐ మునుగోడు నియోజకవర్గ అధ్యక్షుడు రాచకొండ భార్గవ్ అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం బస్టాండ్ ఆవరణలోని తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద ఆదివారం వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాచకొండ భార్గవ్ మాట్లాడుతూ తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజల కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ అన్నారు. తెలంగాణ ప్రాంత ప్రజల విముక్తి కోసం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పోరాడిన మహోన్నత వ్యక్తి ఐలమ్మ అన్నారు. తెలంగాణ ప్రాంతానికి చెందిన ఆడబిడ్డగా రజాకారులపై ఆడపులిగా పోరాడారన్నారు. చాకలి ఐలమ్మ చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవలసిన ఆవశ్యకత ఉందన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఆమె పాత్రను ప్రతి ఒక్కరికి వివరించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఐలమ్మ జీవితాన్ని నేటి ఆడపిల్లలు ఆదర్శంగా తీసుకోవాలని, ఎలాంటి పరిస్థితులనైనా ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జూపెల్లి శివ, పున్న శివ నాగులవంచ సాయి, ఎర్ర దిలీప్ తదితరులు పాల్గొన్నారు.



# మృతుల కుటుంబాలు పరామర్శ



**డోర్నకల్ (దంతాలపల్లి) సమ సమాజం:** జిల్లా జిల్లా అధ్యక్షురాలు మాలోతు కవిత మండలంలోని బొట్లడ గ్రామంలో ఇటీవల మృతి చెందిన కుటుంబాలకు జిల్లా అధ్యక్షురాలు కవిత పరామర్శించారు అనంతరం ఆమె మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు అన్ని విధాల ఆదుకుంటానని అన్నారు అనంతరం ఆర్థిక సహాయం చేశారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుష్మ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

# చాకలి ఐలమ్మ వర్ధంతి



**మహేశ్వరం సమ సమాజం:** తుక్కుగూడ మున్సిపాలిటీలో జరిగిన చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకల్లో పాల్గొన్నారు మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ ఇన్చార్జి అందెల శ్రీరాములు యాదవ్ సహా తుక్కుగూడ మున్సిపాలిటీ అధ్యక్షులు రచ్చ లక్ష్మణ్, స్థానిక ప్రజాప్రతినిధులు బరిగెల రాజు గౌడ్, జాపాల భావన సుధాకర్, రాజమోనిరాజు, ఏరుకల శివకుమార్ గౌడ్ జీఎస్ కృష్ణ గౌడ్, రాజు, బాలరాజు, రవినాయక్ సహా పార్టీ నాయకులు పాల్గొన్నారు.



ఈరోజు జిన్నారం మండలం అండూర్ విల్లెజిలో వీరనారిచాకలి ఐలమ్మ వర్ధంతి గ్రామపంచాయతీ వద్ద వర్ధంతి జర్పడం జ్యారిగింది, ఈకార్యక్రంలో స్థానిక సర్పంచ్ ఖాధీర్, ఉపసర్పంచ్, రావిగౌడ్, తెలంగాణ మాల మహానాడు సంగారెడ్డిజిల్లా ప్రెసిడెంట్ నీరుడ్విశెద్వామీ ముఖ్యత్తిగాపాల్గొన్నారు, రాజాఖసంగం సభ్యులు పాల్గొన్నారు.

# జల్ పల్లి మున్సిపాలిటీలో బిజెపి నుంచి బిఆర్ఎస్ పార్టీలోకి చేరికలు...

**మహేశ్వరం సమ సమాజం:** మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని జల్ పల్లి మున్సిపాలిటీ కోఆప్షన్ సభ్యులు సూరెడ్డి కృష్ణారెడ్డి జల్ పల్లి మున్సిపాలిటీ మహిళా అధ్యక్షురాలు శ్రీమతి.యాస్మిన్ మహమూద్ , సీనియర్ నాయకులు . మహమ్మద్ మహమూద్ ఆధ్వర్యములో 13వ వార్డు పహాడీ షరీఫ్ నుంచి బీజేపీ పార్టీకి చెందిన పలువురు నాయకులు.. తెలంగాణ రాష్ట్ర విద్యా శాఖ మంత్రి శ్రీమతి. పి. సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో జాయిన్ కావడం జరిగినది. బి ఆర్ ఎస్ పార్టీలో చేరిన బిజెపి పార్టీకి చెందిన నాయకులకు గులాబీ కండువా వేసి సాదరంగా బి ఆర్ ఎస్ పార్టీలోకి ఆహ్వానించిన మంత్రి ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పని చేయాలని కోరుచూ కష్టపడే కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తామని తెలిపారు.



Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in